WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 213 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | మంగళవారం 29 జూలై 2025 | వెల : 2-00



# మీ పెట్టుబడులకు మాదీ పూచీ

- ఆంధ్రా-సింగపూర్ బిజినెస్ ఫోరం భేటీలో చంద్రబాబు భరోసా.. పెట్టుబడి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- నవంబరులో విశాఖ భాగస్వామ్య సదస్సుకు రండి.. పెట్టుబడులే కాదు.. పేదలకు సాయమూ చేయండి
- పేద-ధనిక అంతరం తగ్గించడానికే పీ-4.. త్వరలో ఏపీ-సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్
- రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకాశమే హద్దు.. నైపుణ్యమున్న వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేస్తాం
- ఏపీలో 6 పోర్టులు, 7ఎయిర్‌పోర్టులు.. త్వరలో అందుబాటులోకి మరో 4 రేవులు,
- ఇంకో 9 గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు: సీఎం

స్వర్ణసాగరం అమరావతి

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ఎంపికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులకు అత్యంత భద్రత ఉంటుందని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు సోమవారం ఆయన ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం తరపున నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. దీనికి సింగపూర్ కంపెనీలతోపాటు ఏపీ నుంచి కూడా పెద్దఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పారిశ్రామిక, పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు రావాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రాజెక్టులు, పెట్టుబడుల అవకాశాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలు. స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలపై ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతి మాస్టర్‌ప్లాన్ కోసం 2014లో సింగపూర్ వచ్చానని.. సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించి ఇచ్చిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలతో ఏపీతో సింగపూర్ ప్రభుత్వ సంబంధాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన పర్యటనతో సత్సంబంధాల పునరుద్ధరణ జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్ అవినీతిరహిత దేశమని.. అందుకే ఈ దేశమంటే తనకిష్టమని చెప్పారు. ఉద్యోగాల కల్పనలో ఈ దేశ ప్రభుత్వానిది అత్యుత్తమ మోడల్ అని ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ సమీపంలో సింగపూర్ టౌన్‌షిప్ నిర్మించామని గుర్తు చేసుకున్నారు. - మిగతా3లో



## భూమ్మీద దేన్నైనా ఫోర్జరీ చేస్తారు కదా?

- ఈసీకి 'సుప్రీం' ప్రశ్న
- ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు ని చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ల కింద పరిగణించాల్సిందే
- బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్‌లో భాగంగా ఆధార్‌ను గుర్తింపుకార్డుగా ఈసీ పరిగణించడం లేదు


## ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

- రాష్ట్రంలో ఎంఆర్‌ఓ హబ్‌కు సహకరించండి.. ఎయిర్‌బస్‌కు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- ఆసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీతో భేటీ.. ఎవర్ వోల్ట్ చైర్మన్ సైమన్ టాన్‌తోనూ సమావేశం
- ఏపీలో బ్యాటరీ సెల్ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి.. రెన్యూవబుల్ ఎనర్జీలో నైపుణ్య శిక్షణకు టాన్ ఓకే
- బలమైన విద్యా వ్యవస్థకు సింగపూర్ సహకారం కావాలి.. విద్యావేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్
- అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డయాస్పోరా వలంటీర్లకు మంత్రి పిలుపు



స్వర్ణసాగరం అమరావతి

సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి లోకేశ్ పారిశ్రామిక దిగ్గజ సంస్థల ప్రతినిధులను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారిని ఆహ్వానించారు. సోమవారం ఆయన ఎయిర్‌బస్ ఆసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీ, ఎవర్‌వోల్ట్ చైర్మన్ సైమన్ టాన్‌లతో భేటీ అయ్యారు. విమాన యాన రంగంలో మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందడానికి సహకరించాలని ఆనంద్ స్టాన్లీని కోరారు. పొరుగు దేశాలైన - మిగతా3లో





## ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 ఎంపీటీసీ 2 జడ్పీటీసీ, 2 సర్పంచ్ స్థానాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ
- రామకుప్పం, కారంపూడి, విడవలూరు ఎంపీటీసీ ఎన్నికలు..
- ఇక, జూలై 30 నుండి ఆగస్టు 1 వరకూ నామినేషన్ల స్వీకరణ
- ఆగస్టు 12న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

3



## 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశాం

- భారత సైన్యం సత్తాకు 'ఆపరేషన్ సిందూర్' నిదర్శనం
- మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిది
- పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



## ఫలించిన ట్రంప్ దౌత్యం

- థాయ్-కంబోడియా తక్షణ కాల్పుల విరమణ
- థాయ్-కంబోడియా తాజా సరిహద్దు ఘర్షణలకు ఎట్టకేలకు ముగింపు
- ఈ ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం దశాబ్దాలుగా కొనసాగుతున్నదే
- అయితే.. ఈ ఏడాది మే చివరి వారంలో కంబోడియన్ సైనికుడి కాల్చివేత ఘటన నుంచి 817 కిలోమీటర్ల సరిహద్దు వెంట ఉద్రిక్తతలు



## పహల్గాం ఉగ్రదాడి సూత్రదారి సులేమాన్ షా హతం!

- పరేషన్ మహదేవ్ పేరుతో చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్
- ఆపరేషన్‌లో శ్రీనగర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం
- గత ఏడాది శ్రీనగర్-సోన్‌మార్గ్ హైవేలోని జడ్-మోర్హ్ టన్నెల్ నిర్మాణ పనుల్లో ఉన్న ఏడుగురిని హత్య చేసిన ఘటనలో కూడా సులేమాన్ ప్రమేయం

## 'కాలేజీలు ఖాళీ' అంటూ ప్రచారం

- మంత్రి లోకేష్ మాస్ వార్నింగ్
- ఆ క్రమంలో వివిధ అంశాలపై అవాస్తవాలను కథనాల రూపంలో వైసీపీకి చెందిన మీడియా ప్రచురిస్తోంది
- తాజాగా అటువంటి చర్యలే ఆ పార్టీ మీడియా పాల్పడింది
- ప్రకాశం జిల్లా కనిగిరి వంటి మారుమూల ప్రాంతాల్లోని కళాశాలల్లో సైతం అడ్మిషన్లు రెట్టింపు కావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనం



స్వర్ణసాగరం అమరావతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పని తీరునే లక్ష్యంగా చేసుకొని వైసీపీ ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తోంది. ఆ క్రమంలో వివిధ అంశాలపై అవాస్తవాలను కథనాల రూపంలో వైసీపీకి చెందిన మీడియా ప్రచురిస్తోంది. తాజాగా అటువంటి చర్యలే ఆ పార్టీ మీడియా పాల్పడింది. దీనిపై సింగపూర్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. జగన్మోహన్ రెడ్డి అవినీతి విష పుత్రిక, రోత పత్రిక సాక్షిలో ఈ రోజు కాలేజీలు ఖాళీ అంటూ అబద్ధాలను వండి ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యలో గత ఏడాది కాలంగా మేము - మిగతా3లో



## వైఎస్ జగన్ నెల్లూరు పర్యటన.. 10 మందికే అనుమతి!

- ఈనెల 31వ తేదీన గురువారం వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనపై ఆంక్షలు
- కేవలం పది మందికి మాత్రమే అనుమతి అంటూ పోలీసులతో నోటీసులు
- వైఎస్ జగన్ హెలీప్యాడ్ వద్ద కేవలం పది మంది మాత్రమే ఉండాలి
- జగన్ వస్తున్నారంటే జనం తండోపతండాలుగా వచ్చే అవకాశం

మా కలం - సామాన్యుడి బలం
స్వర్ణసాగరం
RNI No : APTEL/2020/1906
జాతీయ తెలుగు దినపత్రిక



# భూమ్మీద దేన్నైనా ఫోర్జరీ చేస్తారు కదా?

బీహార్ ఓటరు జాబితా సవరణలో.. ఆధార్ కార్డుకు పౌరసత్వ గుర్తింపుకార్డుల జాబితా నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా పరిగణించింది. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు ని చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ల కింద పరిగణించాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్‌లో భాగంగా ఆధార్‌ను గుర్తింపుకార్డుగా ఈసీ పరిగణించడం లేదు. తద్వారా ఓట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత ధర్మాసనం ఈసీని ఉద్దేశించి కీలక వ్యాఖ్య చేసింది. "భూమ్మీద దేనినైనా ఫోర్జరీ చేస్తారు కదా?" అని కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలపై సూటిగా ప్రశ్నను సంధించింది. ఈ క్రమంలో.. ఆధార్‌ను తిరస్కరిస్తూ.. బీహార్ ఓటర్ల రివిజన్ ప్రక్రియలో ఓట్లను తొలగిస్తూ వస్తోంది ఎన్నికల సంఘం. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. జులై 10వ తేదీ నాటి విచారణ సందర్భంగా బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్ సబబేనన్న సుప్రీం ధర్మాసనం.. అదే సమయంలో ఆధార్, ఎపిక్, రేషన్ కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఈసీకి స్పష్టం చేసింది. అయితే.. ఇవాళ్టి వాదనల సందర్భంగా ఆధార్‌ను ప్రూఫ్ ఆఫ్ సిటిజన్‌షిప్‌గా పరిగణించడం కుదరదని, రేషన్ కార్డులు నకిలీవి సృష్టించే అవకాశం లేకపోలేదని.. కాబట్టి వాటి మీద ఆధారపడలేమని ఈసీ వాదనలు వినిపించింది. అలాగే ఓటర్ నమోదు ప్రక్రియలో ఆధార్‌ను కేవలం ఐడెంటిటీ ప్రూఫ్‌గా మాత్రమే పరిగణిస్తామని పేర్కొంది. దీనిపై సుప్రీం కోర్టు స్పందించింది.




ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్‌ను ఫోర్జరీ చేయలేరో చెప్పాలంటూ ఈసీని ప్రశ్నించింది. ఓటర్ నమోదు సమయంలో ఆధార్ ప్రస్తావన ఉంటున్నప్పటికీ.. ఓటరు జాబితా గుర్తింపు కోసం ఎందుకు పరిగణించడం లేదని మరోసారి నిలదీసింది. ఈ క్రమంలో.. ఆధార్, ఎపిక్‌ని బీహార్ ఓటర్ రోల్ రివిజిన్‌కు చేర్చాలంటూ ఆదేశించింది. ఎన్నికల సంఘం జాబితాలోని ఏదీ నిర్ణయాత్మక పత్రం కాదు కదా. ఆధార్, ఎపిక్ విషయాల్లో మీరు ఎత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటే గనుక రేపు మీరు అంగీకరించిన ఇతర పత్రాలు కూడా ఫోర్జరీ జరిగితే.. దాన్ని నిరోధించే వ్యవస్థ ఎక్కడ? అని ఈసీకి ప్రశ్న ఎదురైంది. అదే సమయంలో.. ఆగస్టు 1వ తేదీన ఈసీ ప్రచురించబోయే బీహార్ ఓటర్ల డ్రాఫ్ట్ లిస్ట్‌పై మధ్యంతర స్టే విధించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ కోరారు. అయితే.. రేపటి విచారణలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని బెంచ్ స్పష్టం చేసింది.

# 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశాం

**న్యూఢిల్లీ:** భారత సైన్యం సత్తాకు 'ఆపరేషన్ సిందూర్' నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకంగా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టుబెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు. 2025 మే 10వ తేదీని మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై



క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు.

**పాక్ ఓటమిని అంగీకరించింది**

పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకుపడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

**ఎలాంటి ఒత్తిడి లేదు**

ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు.

**విమానాల కూల్చివేతపై..**

ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమాధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

# సొంత దేశాన్నే ఏర్పాటు చేయొచ్చు.. అయితే?

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఉంటూ, రెండంతస్థుల భవనంలో వెస్ట్ ఆర్కిటికా, సబోర్గా, పౌల్వియా, లాడోనియా తదితర నకిలీ దేశాల రాయబార కార్యాలయాలను నిర్వహిస్తున్న హర్ష్ వర్ధన్ జైన్‌ను ఇటీవల ఉత్తర ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సాగించిన అనేక బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి. 47 ఏళ్ల ఈ మోసగాడు దౌత్యపరమైన ప్లేట్లు కలిగిన లగ్జరీ కార్లలో తిరిగాడు. దశాబ్ద కాలంలో 162 విదేశాల్లో పర్యటించాడు. రూ. 300 కోట్ల ఆర్థిక కుంభకోణాన్ని నడిపాడని ఉత్తర ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఇంతకీ కొత్త దేశాన్ని ఎలా సృష్టిస్తారు? ఇందుకు ఏ విధమైన రూపకల్పన చేస్తారు? దేశ జెండాలు, పాస్‌పోర్ట్‌లు, రాజ్యాంగాలు, జాతీయ గుర్తింపులను ఎలా సృష్టిస్తారు.. అనే వివరాల్లోకి వెళ్లే ముందు ఒక స్వతంత్ర దేశాన్ని ఎలా ఏర్పాటు చేయాలని విషయంలోకి వెళదాం. మోంటెవీడియో కన్వెన్షన్ ప్రకారం ఒక దేశానికి నాలుగు లక్షణాలు అవసరం. ఎవరూ హక్కుదారులుకాని భూభాగం, శాశ్వత జనాభా, అధికార ప్రభుత్వం, దౌత్యంలో పాల్గొనే సామర్థ్యం అనేవి తప్పనిసరి. అయితే ఐక్యరాజ్య సమితి గుర్తింపు లేకపోతే ఆ దేశానికి గుర్తింపు దక్కదు. అయినప్పటికీ ఇటువంటి దేశాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. 2019లో భారత్ విడిచి పారిపోయిన అత్యాచార నిందితుడు నిత్యానంద కొంతకాలానికి తెరపైకి వచ్చి, తాను ఒక కొత్త దేశాన్ని స్థాపించానని, దానికి యునైటెడ్ స్టేట్ ఆఫ్ కైలాస అని పేరు పెట్టానని తెలిపాడు. ఈ దేశం ఏర్పాటుకు తన అనుచరులు ఈక్వెడార్ సమీపంలో భూమిని కొనుగోలు చేశారని నిత్యానంద తెలిపారు. అయితే అది వాస్తవానికి ఎక్కడ ఉందో ఎవరికీ ఖచ్చితంగా తెలియదు.



నిత్యానంద వాదనను ఈక్వెడార్ తిరస్కరించింది. తమ గడ్డపై లేదా సమీపంలో అలాంటి దేశం ఏదీ లేదని స్పష్టం చేసింది. అయితే నిత్యానంద మాత్రం తన దేశం పేరుతో కైలాస వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా హ్యాండిల్స్, దౌత్య మిషన్లు, సొంత పాస్‌పోర్ట్‌లు, కరెన్సీని జారీ చేశారు. 2023 ఫిబ్రవరిలో నిత్యానంద సహాయకురాలు విజయప్రియ జనీవాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నప్పుడు కైలాస దేశం అందరి దృష్టిని ఆకర్షించింది. కైలాస దేశం ప్రపంచంలోని పలు దేశాలలో తన రాయబార కార్యాలయాలను ప్రారంభించిందని ఐక్యరాజ్య సమితిలో విజయప్రియ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా, స్వయం ప్రకటిత సూక్ష్మదేశాలు చాలానే ఉన్నాయి. 1967లో పాడీ రాయ్ బేట్స్ బ్రిటిష్ సైనిక వేదిక అయిన సీలాండ్‌ను ఆక్రమించి, ఒక దేశంగా ప్రకటించాడు. దానికి ఒక జెండా, రాజ్యాంగం రూపొందించాడు. పాస్‌పోర్ట్‌లను కూడా జారీ చేశాడు. అయితే నేటికీ ఎవరూ సీలాండ్‌ను సార్వభౌమ దేశంగా గుర్తించ లేదు. ఇదేవిధంగా చెక్ రిపబ్లిక్ నేత వీటీ జెడ్లికా 2015లో లిబర్ల్యాండ్‌ను స్వేచ్ఛావాద కలల దేశంగా ప్రకటించాడు. అయితే నేటికీ దీనికి గుర్తింపు లేదు. ఏది ఏమైనప్పటికీ దేశ నిర్మాణం అంత తేలికైన పనేమీ కాదు.

## ఉత్తరప్రదేశ్ లాంగెస్ట్ సీఎంగా యోగీ ఆదిత్యనాథ్‌కు గుర్తింపు

ఉత్తరప్రదేశ్‌కు వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా యోగీ ఆదిత్యనాథ్ గుర్తింపు పొందారు. యూపీకి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇప్పటివరకు మాజీ సీఎం గోవింద్ వల్లభ్ పంత్ ఉన్నారు. ఇప్పుడు ఆయన రికార్డును యోగీ ఆదిత్యనాథ్ బద్దలుకొట్టారు. గోవింద్ వల్లభ్ పంత్ వరుసగా 8 సంవత్సరాల 127 రోజులు ముఖ్యమంత్రిగా కొనసాగి, రాష్ట్రానికి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. సోమవారంతో కలిపి యోగీ ఆదిత్యనాథ్ వరుసగా 8 సంవత్సరాల 4 నెలల 10 రోజులు యూపీ సీఎంగా కొనసాగారు. దాంతో గోవింద్ వల్లభ్ పంత్ రికార్డు బద్దలైంది. ఈ విషయాన్ని యూపీ సీఎంవో వెల్లడించింది.



## పహల్గాం ఉగ్రదాడి సూత్రదారి సులేమాన్ షా హతం..!



పహల్గాం ఉగ్రదాడి సూత్రదారి సులేమాన్ షా అలియాస్, మూసా ఫౌజీ భద్రతా బలగాల చేతిలో హతమయ్యాడు. ఆపరేషన్ మహదేవ్ పేరుతో చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతాబలగాలు సోమవారం మధ్యాహ్నం జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాయి. హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో పహల్గాం ఉగ్రదాడి సూత్రదారి సులేమాన్ షా అలియాస్ మూసా ఫౌజీ ఉన్నట్లు బలగాలు గుర్తించాయి. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. లష్కరే తోయిబా టాప్ కమాండర్ అయిన సులేమాన్ షా పహల్గామ్ ఉగ్రదాడికి కుట్రపన్నడమే కాకుండా ఆ దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని భద్రతాబలగాలకు చెందిన విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత ఏడాది శ్రీనగర్-సోన్‌మార్గ్ హైవేలోని జడ్-మోర్హ్ టన్నెల్ నిర్మాణ పనుల్లో ఉన్న ఏడుగురిని హత్య చేసిన ఘటనలో కూడా సులేమాన్ ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. జమ్ముకశ్మీర్ పోలీసులు, ఆర్మీ సంయుక్తంగా తాజా ఆపరేషన్ చేపట్టాయి.

ఉగ్రవాదుల నుంచి భద్రతాబలగాలు 17 గ్రనేడ్‌లు, ఒక %వీ%4 కార్బైన్, రెండు %ఖూ%-47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. శ్రీనగర్‌లోని దచిగామ్ ఏరియాలో మౌంట్ మహదేవ్ సమీపంలో ఎన్‌కౌంటర్ జరిగింది. దచిగామ్ ఏరియాలో ముగ్గురు ఉగ్రవాదులు ఉన్నారని సమాచారం అందడంతో భద్రతాబలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ముగ్గురిని హతమార్చాయి. జబర్వాన్, మహదేవ్ పర్వత శ్రేణుల మధ్య జరిగే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌కు మహదేవ్ అని పేరుపెట్టారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 22న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో మారణహోమానికి పాల్పడ్డారు. పర్యాటకులే లక్ష్యంగా కాల్పులకు పాల్పడి 26 మంది ప్రాణాలు తీశారు. వారిలో 25 మంది భారత పౌరులు, ఒక నేపాలీ ఉన్నారు. ఆ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఆపరేషన్‌లో భాగంగా పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. మొత్తం 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ లోక్‌సభలో చర్చ మొదలైంది. లోక్‌సభలో చర్చ మొదలైన రోజే పహల్గామ్ ఉగ్రదాడి సూత్రదారి ఎన్‌కౌంటర్‌లో హతమవడం గమనార్హం.

## చెత్తతో విమానం చేసి.. గాలిలో చక్కర్లు కొట్టి..

**పట్నా:** నేటి తరం యువత ఆధునిక సాంకేతికతను ఆకళింపు చేసుకుని, నూతన ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో మన చుట్టుపక్కల దొరికే వస్తువులతోనే నూతన వస్తువులు రూపొందుతున్నాయి. ఇవి చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి. బీహార్‌కు చెందిన ఒక యువకుడు చేసిన అద్భుతం ఇప్పుడు అందరినీ అమితంగా ఆకట్టుకుంటోంది. బీహార్ కుర్రాడు అవనీష్ కుమార్ తనకు ఎటువంటి డిగ్రీ లేకున్నా, అపారమైన సాంకేతిక నైపుణ్యాలను ఆకళింపు చేసుకున్నాడు. పెద్దపెద్ద శాస్త్రవేత్తలే ఆశ్చర్యపోయేలాంటి ఆవిష్కరణను మన ముందుకు తెచ్చాడు. కేవలం చెత్తతో(వ్యర్థాలతో) ఏకంగా విమానాన్ని తయారు చేశాడు. ఇందుకోసం అతనేమీ ఎటువంటి ల్యాబ్ పైనకూడా ఆధారపడలేదు. తగినంత డబ్బులు కూడా లేని అవనీష్ విమానాన్ని తయారుచేసి, దాన్ని విజయవంతంగా ప్రయోగించాడు. ఈ విమానం తయారీకి అవనీష్ కేవలం ఏడు వేల రూపాయలు ఖర్చుచేశాడు. దీనికి సంబంధించిన వీడియో అందరినీ అలరిస్తోంది. ఏదో చేయాలన్న తపన ఉండి పట్టుదలతో ప్రయత్నిస్తే అసాధ్యమన్నది ఏదీ ఉండదని అవనీష్ నిరూపించాడు. అవనీస్ రూపొందించిన విమానాన్ని, దానిలో ప్రయాణిస్తున్న అతనిని చూసేందుకు వందలాదిమంది తరలిరావడాన్ని మనం ఈ వైరల్ వీడియోలో చూడవచ్చు. వారంతా అవనీష్‌ను ఉత్సాహపరచడాన్ని గమనించవచ్చు.



## ఫలించిన ట్రంప్ దౌత్యం..

ఆసియా దేశాలు థాయ్-కంబోడియా తాజా సరిహద్దు ఘర్షణలకు ఎట్టకేలకు ముగింపు పడింది. ఇరు దేశాలు ఎలాంటి షరతులు లేకుండా తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ విషయాన్ని చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన మలేషియా ప్రధాని అన్వర్ అబ్రహీం సోమవారం ప్రకటించారు. ఈ ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం దశాబ్దాలుగా కొనసాగుతున్నదే. అయితే.. ఈ ఏడాది మే చివరి వారంలో కంబోడియన్ సైనికుడి కాల్చివేత ఘటన నుంచి 817 కిలోమీటర్ల సరిహద్దు వెంట ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాల పరస్పర ఆరోపలతో దాడులను మొదలై.. తీవ్రతరం అవుతూ వచ్చాయి. ఈ క్రమంలో.. గత నాలుగైదు రోజుల ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన 34 మంది మరణించగా, లక్షా 68వేల మంది నిర్వాసితులు అయ్యారు. దీంతో యుద్ధం ఆపేందుకు థాయ్-కంబోడియా నేతలతో తాను మాట్లాడానని, వారు చర్చలు జరిపేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారని జులై 26వ తేదీన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో.. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మధ్యవర్తిత్వం చేసేందుకు ముందుకొచ్చారు. ఆయన ఆహ్వానం మేరకు పుత్రజయ(మలేషియాలో)లోని ఇబ్రహీం నివాసంలో సోమవారం థాయ్ తాత్కాలిక ప్రధాని పుమ్తామ్ వేచాయచాయ్, కంబోడియా ప్రధాని హున్‌మానెట్ సమావేశయ్యారు. ఈ భేటీకి చైనా, అమెరికా రాయబారులు కూడా హాజరయ్యారు. భేటీ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇరు దేశ ప్రధానుల చేతులను చేతిలో ఉంచి సంధి కుదిర్చినట్లు ప్రకటించారు. ట్రంప్ ప్రతిపాదన మేరకు ఇరు దేశాల ప్రధానులం కాల్పుల విరమణకు అంగీకరించాం అని కంబోడియా ప్రధాని హున్‌మానెట్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అయితే సోమవారం చర్చల సమయంలోనూ ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు కొనసాగినట్లు సమాచారం.

**ఇరుదేశాల ఘర్షణలు దేనికంటే..**

ప్రాచీన హిందూ దేవాలయాలు అయిన తా మోయాన్ థామ్, 11వ శతాబ్దపు ప్రేహ విహార్ ఆలయాలు ఇరు దేశాల సరిహద్దు వివాదాలకు కేంద్రంగా ఉన్నాయి. 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం ప్రేహ విహార్ ఆలయాన్ని కంబోడియాకే చెందుతుందని తీర్పు ఇచ్చింది. అయితే.. థాయ్‌లాండ్ ఆ తీర్పును ఖండిస్తూ ఇచ్చింది. 2008లో %ఖచీజుూజూ% వారసత్వ ప్రదేశంగా నమోదు చేయాలన్న ప్రయత్నం తర్వాత ఇరు దేశాల ఉద్రిక్తతలు పెరిగాయి. 2025 మే నెల చివర్లో నుంచి సరిహద్దు వివాదం ముదరసాగింది. ఈ క్రమంలో ప్రైవేట్‌గా సంధి కోసం ప్రయత్నించిన పేటోంగ్టార్న్ షినవత్రా.. కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌కి ఫోన్ కాల్ చేసి 'అంకుల్' అంటూ మాట్లాడింది. ఆ కాల్ రికార్డ్ బయటకు రావడంతో.. అనూహ్యంగా ఆమె పదవి నుంచి వైదొలగాల్సి(సస్పెండ్) వచ్చింది. ఈ తరుణంలో.. జూన్‌లో కంబోడియా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని వివాద పరిష్కారానికి కోరింది. థాయ్‌లాండ్ మాత్రం న్యాయస్థాన అధికారాన్ని అంగీకరించలేదు, ద్వైపాక్షిక చర్చలే సరైన మార్గమని పేర్కొంది.

మా కలం - ప్రజాస్వామ్యానికి బలం
RNI No : APTEL/2020/1596
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత

**తిరుపతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బ్యాడ్జిని అధికారులు చంద్రబాబుకు అందించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు."కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాను. ఆ కుటుంబాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపు ఇస్తున్న నేను.. చెప్పడమే కాదు.. ఆచరించి చూపాలని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నా. ఈ కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రణాళిక రూపొందిస్తాను. ఐయామ్ ఏ మార్గదర్శి. సమాజంలో పేద-ధనికుల మధ్య అంతరాలు తగ్గించే ఇలాంటి కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తే.. ఇప్పుడు పేదలను ఆదుకునేందుకు పీ4 అమలుకు ప్రణాళికలు చేపట్టాం. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూపొందించాం. పేదలకు చేయూతనిచ్చే పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు.పీ4లో భాగంగా బంగారు కుటుంబాలుగా నమోదైన వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి. ఇవాళ్టి బంగారు కుటుంబాలు.. రేపటి మార్గదర్శులుగా ఎదగాలన్నదే నా ఆలోచన. సాయం పొందిన సాయం చేసేందుకు ముందుకు



వస్తారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి. దీన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే ఈ కార్యక్రమం శాశత్వంగా ఉండిపోతుంది. చాలా మందికి మంచి ఆలోచనలు ఉంటాయి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాలున్న వారు పేదరికం కారణంగా వెనుకబడిపోతున్నారు. ఇలాంటి వారికి చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఎన్నో కార్యక్రమాలు చేసిన నాకు.. పీ4 కార్యక్రమం మనస్సుకు చాలా దగ్గరగా ఉంది" అని చంద్రబాబు అన్నారు."బంగారు కుటుంబాలుగా నమోదైన వారి అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తాం. బంగారు కుటుంబాలు అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది.. వాళ్లు చేయగలిగే పనులేంటీ..? అనే అంశాలపై ఓ పది పాయింట్లతో కూడిన సర్వే చేపడుతున్నాం. వీరి అభివృద్ధికి ఏం చేస్తున్నామనే విషయాన్ని వివరించేందుకు ప్రతి బంగారు కుటుంబానికి విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికల ద్వారా వారి అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్దం చేస్తాం. బంగారు కుటుంబాల స్థితిగతులపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష చేపట్టాలి." అని సీఎం అన్నారు. ప్రతిష్టాత్మక "పీ4" పథకంపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నేడు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో "పీ4" పథకం లోగోను ఆవిష్కరించారు.?

"ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి విడత ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నా దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకు పని చేయాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్ర స్థాయి ఉద్యోగి వరకు కృషి చేయాలి. బంగారు కుటుంబాలను.. మార్గదర్శులను గుర్తించే విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగ్గా పని చేయాలి. వచ్చే 15 రోజుల్లో దీని కోసం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కసరత్తు చేయాలి. ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి." అని సీఎం సూచించారు. జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. సీఎం స్ఫూర్తితో తాను కూడా ఐదు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ ప్రకటించారు. షాజహాన్ ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ తరహా కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తామని ప్రజా ప్రతినిధులు సీఎంకు హామీనిచ్చారు

# మీ పెట్టుబడులకు మాదీ పూచీ

-మొదటిపేజీ తరువాయి

సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టాలని.. విశాఖ సదస్సుకు ప్రతిపాదనలతో హాజరు కావాలని కోరారు. అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుందామన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

**రవాణా, సర్క్యులర్ ఎకానమీ అమలు..**

2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో ప్రజల ఆర్థిక పురోగతి కోసం పని చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకాశమే హద్దుగా అవకాశాలున్నాయి. పెట్టుబడులకు అనుకూలంగా ఉండడంతో పాటు వాటికి భద్రతా ఉంటుంది. అమరావతి, విశాఖలో లాజిస్టిక్ కారిడార్లు ఏర్పాటవుతున్నాయి. పెట్టుబడిదారులకు అవసరమైన నైపుణ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. తక్కువ వ్యయంతో రవాణా, సర్క్యులర్ ఎకానమీని అమలు చేయడం ద్వారా సుస్థిర భవిష్యత్ దిశగా అడుగులు వేస్తున్నాం. ఫ్యూచర్ టెక్నాలజీ కోసం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. సమీప భవిష్యత్‌లో సంప్రదాయ విద్యుత్ వినియోగం నుంచి గ్రీన్ ఎనర్జీకి మారిపోతున్నాం. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా.. రాష్ట్రం నుంచే మూడో వంతు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పారిశ్రామిక అభివృద్ధి కోసం 24 ?థీమాటిక్ విధానాలను ప్రకటించాం. ఎలాట్రానిక్ మొబిలిటీ, వేస్ట్ రీసైక్లింగ్, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులు, ఏరోస్పేస్, రక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ ఎంఎస్ఎంఈలు, మారిటైమ్ బోర్డు, మైనర్ మినరల్, స్పోర్ట్స్, టెక్స్‌టైల్ విధానాలు తెచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్, ఇన్నోవేషన్ పాలసీలను అమలు చేస్తున్నాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం. రాష్ట్రం అతివేగంగా అభివృద్ధి చెందుతోంది. సుదీర్ఘ తీర ప్రాంతం ఏపీ సొంతం. ప్రస్తుతం ఆరు ఆపరేషనల్ పోర్టులు అందుబాటులో ఉన్నాయి. మరో నాలుగు రేవులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో మారిటైమ్ కార్గో రంగంలో అపార అవకాశాలున్నాయి. మా ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచీ



పెద్దఎత్తున పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌కు చాన్సుంది. ఏడు విమానాశ్రయాలు ఉన్నాయి. మరో 9చోట్ల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నాం. విశాఖలో ప్రభుత్వ స్టీల్ ప్లాంటుకు సమీపంలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ స్థాపిస్తున్నాం. విశాఖలో అదానీ గ్రూప్ డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. గూగుల్ కూడా ఇక్కడే డేటా సెంటర్ పెట్టబోతోంది. భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నాం. హైదరాబాద్, బెంగళూరు, అమరావతి, చెన్నై నగరాల్లోని ఐదు కోట్ల మందిని కలిపేలా త్వరలో బుల్లెట్ ట్రైన్ రానుంది. స్టార్టప్ ఎకోసిస్టమ్ కోసం ప్రత్యేక హబ్‌లు ఏర్పాటు చేయనున్నాం. సంపద సృష్టించడమే నా ధ్యేయం.

**నేడు మూడోరోజు సీఎం షెడ్యూల్..**

క్యారియర్, విల్మర్, టీవీఎస్, మురాటా ప్రతినిధులతో చర్చలు..

సింగపూర్ అధ్యక్షుడు, మాజీ ప్రధానితో సమావేశం..

యూట్యూబ్ అకాడమీతో ఒప్పందం.

ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫిన్‌టెక్, ఆరోగ్య, పరిశ్రమలు, మౌలిక రంగాల్లో పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలతో భేటీ.

గూగుల్ క్లౌడ్ ప్రతినిధులతోనూ సమావేశం. బిజినెస్ రౌండ్ టేబుల్ భేటీకి హాజరు.

**అప్పుడు పీ-3, ఇప్పుడు పీ-4**

గతంలో పీ-3 అమలు చేశాం. ఇప్పుడు పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) విధానం తీసుకొచ్చాం. పేదలు-ధనికుల మధ్య అంతరం తగ్గించడమే ఈ కార్యక్రమం లక్ష్య. పేదలకు చేయూతనివ్వడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. పెట్టుబడులే కాదు.. పేదలకు సాయం చేయాలని కూడా ఇదే వేదికగా కోరుతున్నాను.

# చెత్త తీసుకెళ్లి,..బహుమతులు తీసుకోండి

**గుంటూరు :** చెత్తే కదా అని వేస్టు కింద లెక్కగట్టకండి. చెత్త కాదు అది సంపద అంటోంది ఏపీ ప్రభుత్వం. అందుకే చెత్త సేకరణ చేస్తోంది. చెత్తతో సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతోంది. ఇదే క్రమంలోనే గుంటూరు జిల్లా పొన్నూరు ను చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు నడుం బిగించారు. పొన్నూరు మున్సిపాలిటీ ఐటీసీ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఇక ఒప్పందంలో భాగంగా పొన్నూరు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెత్త సేకరణపై ఐటీసీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారు. అలాగే ఓ సంచి అందిస్తారు. స్కూలుకు వచ్చేటప్పుడు ఈ సంచీలో ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకురావాల్సి ఉంటుంది. ఆ చెత్తను తూచి వారికి బహుమతులు అందిస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే పట్టుదలతో ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. అలాగే చెత్త వేస్తే నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేసే స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని గుంటూరు గ్రామీణ మండలంలో ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారు. వీటితో పాటుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా పొన్నూరును చెత్తరహిత పట్టణంగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. పొన్నూరులో తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తూ ఉంటారు. అయితే ఇక్కడి నుంచి వ్యర్థాల తొలగింపు లేకపోవటంతో డంపింగ్ యార్డులో చెత్త గుట్టలు గుట్టలుగా పెరిగిపోయింది. ఈ స్థాయిలో చెత్తను బయటకు తరలించాలంటే పొన్నూరు మున్సిపాలిటీకి ఆర్థికంగా ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలోనే పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చెత్తను తరలించేందుకు ఐటీసీ సంస్థతో పొన్నూరు మున్సిపాలిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ




సూచనలతో పొన్నూరు మున్సిపాలిటీ, ఐటీసీ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణకు కొత్త విధానాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఇక్కడి నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మరికొన్ని చోట్ల ఇదే తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.ఈ విధానంలో భాగంగా పొన్నూరులోని స్కూళ్ల విద్యార్థుల నుంచి చెత్త సేకరించి వారికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. పొన్నూరు పరిధిలోని జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారుగా 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అంచనా. ఐటీసీ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు చెత్త సేకరణ, వాటి నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో అవగాహన కల్పిస్తారు. అలాగే ప్రతి విద్యా?ర్థికి ఓ సంచీని అందజేయనున్నారు. రోజూ ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో విద్యార్థులు ఆ సంచీలో తమ ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకుని రావాల్సి ఉంటంది. అలా తీసుకువచ్చిన పొడిచెత్తను తూకం వేసి.. ఆ బరువు ప్రకారం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తారని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.లాగే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి వెళ్లి మున్సిపాలిటీ అధికారులు, ఐటీసీ ప్రతినిధులు చెత్త సేకరణ, ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అలాగే సేకరించిన తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే ప్రయత్నం చేస్తామని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.

## ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

-మొదటిపేజీ తరువాయి

శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఆగ్నేయాసియా మార్కెట్ల నుంచి విమాన సేవల డిమాండ్ పెరుగుతోందని, ఇది ఎంఆర్‌ఓ సేవలకు పెద్ద క్యాప్టివ్ మార్కెట్‌ను సృష్టించనుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో 850 కంటే ఎక్కువ ఎయిర్‌బస్ విమానాలు ఎగురుతున్నాయని వివరించారు. దక్షిణాసియాలో ఎయిర్‌బస్‌కు డెడికేటెట్ ఎమ్ఆర్‌ఓ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారే అవకాశం ఉందన్నారు. విమానయాన భాగస్వాములకు సమర్ధవంతమైన సర్వీసింగ్ సేవల కోసం ఏపీతో కలసి పనిచేయాల్సిందిగా కోరారు. సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి, సింగపూర్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి సౌకర్యాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సౌకర్యాలను చూసేందుకు ఒకసారి ఏపీకి రావాలని ఆనంద్ స్టాన్లీని ఆహ్వానించారు.

**సోలార్ సెల్ యూనిట్ స్థాపించండి**

రాష్ట్రంలో పెద్దఎత్తున సోలార్‌సెల్ మాడ్యూల్, బ్యాటరీ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎవర్‌వోల్ట్ గ్రీన్ ఎనర్జీ చైర్మన్ సైమన్ టాన్‌ను లోకేశ్ కోరారు. రెన్యూ, సుజలాన్ వంటి భారీ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయని చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన సౌరశక్తి నిల్వ ఆవిష్కరణ కోసం ఎవర్ వోల్ట్ రీసెర్చ్ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలలో రెన్యూవబుల్ ఎనర్జీ స్కిల్ డెవల్‌పమెంట్ ట్రైనింగ్‌కు సహకారం అందించాలని కోరారు. ఎంపిక చేసిన ఓ ఐటీఐలో దీనిపై ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ ఇస్తామని సైమన్ టాన్ హామీ ఇచ్చారు. తమ సంస్థ ఉన్నత స్థాయి బృందంతో మాట్లాడి ఏపీలో యూనిట్ ఏర్పాటు చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని టాన్ వెల్లడించారు.

**మోదీ వచ్చినపుడు కృతజ్ఞతలు తెలపండి**

గత ఐదేళ్ల విధ్వంస పాలన చూశాక రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు విదేశాల్లోని తెలుగు వారంతా ముందుకు రావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగు దయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వలంటీర్లు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ త్వరలోనే సింగపూర్‌లో పర్యటిస్తారని... తెలుగువారంతా పెద్దఎత్తున పాల్గొని రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

**భవిష్యత్‌కు అనుగుణంగా కోర్సులు**

రాష్ట్రంలో యువతను ఉద్యోగాల కోసమేగాకుండా.. భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధం చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని వర్సిటీల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశ పెడుతున్నామన్నారు. బలమైన విద్యా పర్యావరణ వ్యవస్థకు సింగపూర్ సహకరించాలని కోరారు. సింగపూర్ విద్యావేత్తలతో 'నైపుణ్యాల నుంచి సామర్థ్యాలకు శ్రామికశక్తి పరివర్తనను వేగవంతం చేయడం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధికి సంప్రదాయ విద్యావిధానం సరిపోదన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవం సాంకేతిక నైపుణ్యాలనే కాకుండా సామర్థ్యాలను కూడా కోరుకుంటోందని చెప్పారు. సంక్లిష్ట సమస్యలను స్వీకరించే, ఆవిష్కరించే, పరిష్కరించే సామర్థ్యం కూడా శ్రామికశక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలకు ఏపీ కేంద్ర బిందువు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వేగవంతమైన మార్పు కోసం సింగపూర్‌తో కలసి పనిచేస్తామని పేర్కొన్నారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిపలపై సింగపూర్ వర్సిటీలతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ ప్రకటించారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 ఎంపీటీసీ 2 జడ్పీటీసీ, 2 సర్పంచ్ స్థానాల ఎన్నికలకు ఇవాళ (జులై 28)నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో రామకుప్పం, కారంపూడి, విడవలూరు ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇక, ఇదే క్రమంలో కొండపూడి, కడియపులంక గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు కూడా జరుగుతాయి. ఇక, జూలై 30 నుండి ఆగష్టు 1 వరకూ నామినేషన్ల స్వీకరణకు అనుమతిస్తారు. ఆగస్టు 12న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనుండగా, ఆగస్టు 14న ఏపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వస్తాయి. ఆగస్టు 10న సర్పంచ్ ఎన్నికలు .. ఉండగా, అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు.

## వైఎస్ జగన్ నెల్లూరు పర్యటన..
## 10 మందికే అనుమతి!

**విజయవాడ:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం మరోసారి కక్ష సాధింపు చర్యలకు దిగింది. వైఎస్ జగన్ ఏ పర్యటన చేపట్టినా జనం ప్రభంజనంలా తరలి రావడాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు.. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జనాన్ని నియంత్రించాలని చూస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 31వ తేదీన గురువారం వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనపై ఆంక్షలు విధించింది. కేవలం పది మందికి మాత్రమే అనుమతి అంటూ పోలీసులతో నోటీసులు ఇప్పించింది చంద్రబాబు సర్కారు. వైఎస్ జగన్ హెలీప్యాడ్ వద్ద కేవలం పది మంది మాత్రమే ఉండాలని నోటీసుల్లో పేర్కొంది. వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనలో భాగంగా జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నేత కాకాణితో వైఎస్ జగన్ ములాఖత్ కానున్నారు. ఇక్కడకు కూడా జనం రాకూడదని ఆంక్షలు విధించింది. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి వైఎస్ జగన్ వెళ్లే క్రమంలో కూడా జనానికి అనుమతి లేదని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. కేవలం కాన్వాయ్‌లకు మాత్రమే అనుమతి ఉందని, జనం పది మంది మించి రావడానికి వీల్లేదని నోటీసుల్లో స్పష్టం చేశారు. జగన్ వస్తున్నారంటే జనం తండోపతండాలుగా వచ్చే అవకాశం ఉండటంతో కూటమి సర్కారు భయభ్రాంతులకు గురౌవుతుంది., అందుకే ఆంక్షలతో వైఎస్ జగన్ జనాభిమానాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండిపడుతోంది.

**అప్పుడు హెలీప్యాడ్‌కు అనుమతి లేదంటూ..**

జులై 3న వైఎస్ జగన్ చేపట్టాల్సిన నెల్లూరు పర్యటనకు సైతం అ?డ్డంకులు సృష్టించింది కూటమి సర్కారు. హెలీప్యాడ్‌కు అనుమతి ఇవ్వకుండా కుట్రలకు తెరలేపింది. గత నెల 27న వైఎస్ జగన్ పర్యటన కోసం వైఎస్సార్‌సీపీ నేతలు దరఖాస్తు చేశారు. ఆ సమయంలో హెలిప్యాడ్‌కి అనుమతి ఇవ్వకుండా అడ్డంకులు కల్గించారు. ఇప్పుడు పది మంది మాత్రమే రావాలంటూ ఆంక్షల పర్వాన్ని తెరపైకి తెస్తూ మరోమారు నోటీసులు ఇవ్వడం వైఎస్ జగన్ పర్యటనను ఏదో రకంగా అడ్డుకోవాలని చూడటమేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## 'కాలేజీలు ఖాళీ' అంటూ ప్రచారం..

-మొదటిపేజీ తరువాయి

తెచ్చిన సంస్కరణల కారణంగా 2025-26 విద్య సంవత్సరంలో దాదాపు 18 శాతం మేర అడ్మిషన్లు పెరిగాయి. %ఖణ×ూజు% డేటా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయి. ప్రకాశం జిల్లా కనిగిరి వంటి మారుమూల ప్రాంతాల్లోని కళాశాలల్లో సైతం అడ్మిషన్లు రెట్టింపు కావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనం. విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే తప్పుడు రాతలపై ప్రభుత్వం చట్ట పరంగా చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు వైసీపీ మీడియా, నేతలపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను లక్ష్యంగా చేసుకుని పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు పి. నారాయణ, నారా లోకేష్, టీజీ భరత్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఆ క్రమంలో ఈ ప్రతినిధి బృందం పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. జులై 31వ తేదీన ఈ పర్యటన ముగించుకుని సీఎం చంద్రబాబు బృందం స్వదేశానికి తిరిగి రానుంది. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి పట్టం కడుతూ ఆంధ్రప్రదేశ్ ఓటరు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దీంతో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పలు కుంభకోణాలను వెలికి తీసే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం చేపట్టంది. అలాంటి వేళ.. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీకి చెందిన మీడియా అసృత కథనాలకు తెర తీసిందనే వాదన వినిపిస్తోంది.

స్వర్ణసాగరం





# దుల్కర్ 'ఆకాశంలో ఒక తార'.. గ్లింప్స్ చూశారా?

మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగులో వరస సినిమాలు చేస్తున్నాడు. హీరో రానాతో పాటు 'కాంత' అనే మూవీని నిర్మిస్తున్న దుల్కర్.. అందులో హీరోగానూ చేస్తున్నాడు. 1950–60ల్లో ఓ హీరో–డైరెక్టర్ మధ్య జరిగే ఇగో క్లాష్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో దాన్ని తెరకెక్కిస్తున్నారు. మరోవైపు తెలుగులోనే 'ఆకాశంలో ఒక తార' చిత్రంలోనూ నటిస్తున్నాడు. సోమవారం దుల్కర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ నిర్మిస్తున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాలో దుల్కర్ హీరో కాగా పవన్ సాధినేని దర్శకుడు. జీవీ ప్రకాశ్ సంగీతమందిస్తున్నాడు. గ్లింప్స్‌లో అలానే దుల్కర్‌ని ఓ సాధారణ కుర్రాడిగా చూపించారు. బ్యూటీఫుల్ విజువల్స్ కూడా ఉన్నాయి. అయితే ఓ పల్లెటూరికి చెందిన కుర్రాడు.. అంతరిక్షంలోకి వెళ్లాలనే తన కల ఎలా నెరవేర్చుకున్నాడు అనేదే స్టోరీ అని కొన్నాళ్ల క్రితం రూమర్స్ వచ్చాయి. టీజర్, ట్రైలర్ వస్తే ఇది నిజమా కాదా అని తెలుస్తుంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు.




# ఉల్లిపొర లాంటి చీరలో కృతి శెట్టి.. అందంతో చంపకంటున్న ఫ్యాన్స్!

అందాల ముద్దుగుమ్మ కృతి శెట్టి గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ చీరలో తన గ్లామర్‌తో చంపేస్తుంది. క్యూట్ క్యూట్ ఎక్స్ ప్రెషన్స్‌తో ఉన్న అందమైన ఫొటోస్ ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. దీంతో ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఉప్పెన సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ముద్దుగుమ్మ కృతి శెట్టి. మొదటి సినిమాలోనే తన అందంతో టాలీవుడ్ ఆడియన్స్ మనసు దోచుకుంది ఈ అమ్మడు. బేబమ్మగా తెలుగు కుర్రకారు డ్రీమ్ గర్ల్‌గా మారిపోయింది. ఎంట్రీ ఇవ్వడంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడంతో ఈ అమ్మడుకు ఆఫర్స్ క్యూ కట్టాయనే చెప్పాలి. బంగార్రాజు, కస్టడీ, శ్యామ్ సింగ రాయ్, మనమే, ఈ అమ్మాయి గురించి మీకు చెప్పాలి. ది వారియర్, మాచర్ల నియోజక వర్గం వంటి చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాల్లో బంగార్రాజు, ఉప్పెన సినిమాలు బ్లాక్ బస్టర్‌గా నిలవగా మిగితా సినిమాలు మాత్రం అంత బజ్ క్రియేట్ చేయలేకపోయాయి. ముఖ్యంగా చెప్పాలంటే చేసిన ప్రతి సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయాయి. దీంతో ఈ అమ్మడుకు టాలీవుడ్‌లో ఆఫర్స్ రాకపోవడంతో తమిళ్, కన్నడ ఇండస్ట్రీస్ పై కన్నేసింది ఈ బ్యూటీ. ప్రస్తుతం అక్కడ వరస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ఓవైపు సినిమాలు చేస్తూనే, మరో వైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది కృతి. ఎప్పటికప్పుడు వరస ఫొటో షూట్స్ చేస్తూ.. తన అందంతో మతి పోగొడుతుంది. తాజాగా ఈ బ్యూటీ, రెడ్ చీరలో అందంగా రెడీ అయ్యి పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోల్లో ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. అంత క్యూట్‌గా ఉంది.ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో ఉల్లి పొరలాంటి చీరలో అందాలతో ఆగం చేయకు కృతి అని కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు మాత్రం, రెడ్ చీరలో చాలా క్యూట్ గా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఆ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.



# శర్వానంద్ నారి నారి నడుమ మురారి రిలీజయ్యేది ఎప్పుడో?

కథను నమ్మి సినిమాలు చేసే అతికొద్ది మంది టాలీవుడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు శర్వానంద్. గతేడాది చివరగా మనమే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు శర్వానంద్. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి నారి నారి నడుమ మురారి. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. ఈ మూవీ విడుదల తేదీని ఇప్పటికీ ఫైనల్ చేయకపోవడానికి కారణమేంటని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్ ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. మేకర్స్ ఓటీటీ డీల్ ఫైనలైజ్ చేసే పనిలో ఉన్న కారణంగా విడుదల తేదీ ప్రకటించడంలో ఆలస్యం జరుగుతుందట. ఓటీటీ డీల్ సినిమా బిజినెస్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుందని తెలిసిందే. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్, ఏజెంట్ ఫేం సాక్షి వైద్య ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే ఇరువురు భామల కౌగిలిలో స్వామి , ఇరుకున పడి నీవు నలిగితివా అంటూ షేర్ చేసిన పోస్టర్ ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తుంది. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్నారు. శర్వానంద్ మరోవైపు అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో %బాహ్లుతీఖు% 36లో కూడా నటిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది.





## విజయ్ దేవరకొండతో ఫ్యాన్స్ మీట్.. బిర్యానీతో పాటు సెల్ఫీలు

రౌడీబాయ్ విజయ్ దేవరకొండ తన అభిమానులతో కొంత సమయం పాటు సరదాగ గడిపారు. తను నటించిన కొత్త సినిమా కింగ్డమ్ విడుదల సందర్భంగా వారందరినీ కలుసుకున్నారు. అందుకు వేదికగా హైదరాబాద్‌లోని సారథి స్టూడియో నిలిచింది. తమ అభిమాన హీరోను కలిసి దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. విజయ్ దేవరకొండ ఏర్పాటు చేసిన ఫ్యాన్స్ మీట్‌లో ఎక్కువమంది కాలేజీ విద్యార్థులే పాల్గొన్నారు. వాస్తవంగా ఆయన్ను యూత్ ఎక్కువగా ఇష్టపడుతారని తెలిసిందే. ఈ క్రమంలో విజయ్ కూడా వారిని ఎంతమాత్రం నిరుత్సాహపరచలేదు. అక్కడికి వచ్చిన తన ఫ్యాన్స్ అందరితో ఫోటోలు దిగారు. వారందరూ కూర్చునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడమే కాకుండా.. చికెన్‌తో పాటు బగారా అన్నం రెడీ చేపించారు. తమ పట్ల విజయ్ చూపిన ప్రేమకు అభిమానులు ఫిదా అయ్యారు. నేడు (జులై 28) కింగ్డమ్ ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో జరగనుంది. సాయింత్రం 5గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున విజయ్ ఫ్యాన్స్ పాల్గొననున్నారు. 'కింగ్‌డమ్' చిత్రం జులై 31న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. పీరియాడికల్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ కనిపించని వైవిధ్యమైన పాత్రలో, స్పై పోలీస్ ఆఫీసర్‌గా సందడి చేయనున్నారట విజయ్. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, పాటలకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజయ్ నటించిన ఏ సినిమా ఇప్పటి వరకూ రెండు భాగాలుగా రాలేదు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# సభ్య సమాజం తలదించుకునేలా పి.ఈ.టి ప్రవర్తన





## వైసీపీ ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్

కోట స్వర్ణసాగరం జూలై 28

సభ్య సమాజం తలదించుకునేలా పి.ఈ.టి మాస్టర్ సుభాన్ ప్రవర్తించారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ పేర్కొన్నారు.కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం చోటు చేసుకున్న దళిత విద్యార్థినిలను పి.ఈ.టి మాస్టర్ హింసించిన ఘటనపై సోమవారం బాలికల పాఠశాల వద్దకు విద్యార్థులను పరామర్శించేందుకు వైసీపీ ఎమ్మెల్సీ మెగా మురళీధర్ వచ్చారు.అయితే విద్యార్థులకు తరగతులు జరుగుతూ ఉండడంతో పాఠశాల బయటే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ సిబ్బందితో మేరీగా మురళీధర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్ మాట్లాడుతూ దళిత విద్యార్థినిల పట్ల యూనిఫామ్ వేసుకుని రాలేదనే కారణంతో విద్యార్థినిలను హింసించడం చాలా బాధాకరమని, ఇలాంటి వారిపై చట్టపరిమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అంతేకాకుండా పి.ఈ.టి మాస్టర్ కి సహకరించిన గణిత ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి పై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి కోట మండలం కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, ఉప్పల ప్రసాద్ గౌడ్,షనీల్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి,కోట మండల జాయింట్ సెక్రెటరీ పాముల సురేంద్ర,గంపా కోటేశ్వరరావు,సుధారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాసు ట్రస్టు వారిచే నోటు పుస్తకాల పంపిణీ



ఐరాల జులై 28 స్వర్ణ సాగరం

ఐరాల మండలంలో 35 యర్లంపల్లె, నాగవాండ్లపల్లె, చంగనపల్లె పంచాయతీలోని 7 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు వాసు ట్రస్టు వ్యవస్థాపకులు సింగపూర్లో స్థిరపడ్డ సంపతి ఈశ్వర్ వితరణ తో ట్రస్టు నిర్వహకులు సూరిమాని రాజారాం నోటు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యాసామాగ్రి పంపిణీ చేయడమైనది.

గత 18 సంవత్సరాలుగా నిర్వహింపబడుతున్న ఈ కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరంలో కూడా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడమైనది.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రుషేంద్ర బాబు, దామోదర్ నాయుడు మాట్లాడుతూ వాసు ట్రస్ట్ సేవలను కొనియాడారు. అలాగే వీరి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి,జనార్ధన్, సుధాకర్, చలపతి, గుణసుందరి, కార్తీక్ రాజు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ మురళీమోహన్ ని కలిసిన కాణిపాకం నూతన ఎస్సై నరసింహులు

## కాణిపాకం ఎస్సైగా బాధ్యత చేపట్టిన నర్సింహులు



కాణిపాకం జులై 28 స్వర్ణ సాగరం

కాణిపాకం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహులు. సోమవారం ఉదయం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు అందుకుని కాణిపాకం పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం పూతలపట్టు శాసనసభ్యులు డా.కలి కిరి మురళీ మోహన్ నీ సోమ వారం సాయంత్రం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహుకరించారు. కాణిపాకం పుణ్యక్షేత్రంలో శాంతి భద్రతల నిర్వహణలో విఘాతం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కాణిపాకం ఆలయానికి వేలాది భక్తులు వచ్చే నేపథ్యంలో పోలీసు విభాగం పూర్తి సహకారం అందించాలని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రత అత్యంత కీలకమని, పోలీసుల యాక్టివ్ పాత్ర కాణిపాకం అభివృద్ధికి తోడ్పడాలి అని పేర్కొన్నారు.

# ఇసుక ఉచితం అంటే పేదలకా లేక కార్పొరేట్లకా





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల మధ్య స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో నివసించుచున్న రైతులు మరియు పేద ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు , పేదల గృహ నిర్మాణాల కొరకు ఉచిత ఇసుకను అందజేస్తామని ప్రకటించారు. అయితే, పేదల గృహ నిర్మాణాలు ప్రారంభం కాకముందే ఇసుక కొరత తీవ్రమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భవిష్యత్తులో ఇసుక లభ్యత మరింత కష్టతరం కాగలదనే భయం వ్యక్తమవుతోంది.స్వర్ణముఖి నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులు రైతులను బెదిరిస్తున్నారు. స్వర్ణముఖి నది నుండి పంట పొలాలలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ అడ్డుగా ఉండటంతో సరాసరి ట్రాక్టర్లతో దాని మీదగా వెళు_న్నారు . స్మశానవాటికకు వెళ్ళే మార్గాన్ని ఉపయోగించుకొని ఇసుక అక్రమ రవాణా జరుపుతున్నారు. గతంలో నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్ల గురించి ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల మధ్య ఈ ప్రాంతం రెవెన్యూ పరంగా ఉండటంతో, అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టేసుకుంటూ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ఇది అధికార వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చూపిస్తోంది.స్థానిక రైతులు ఈ అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో నదిలోకి వెళ్ళే మార్గంలో కాలువలు తవ్వారు. అయితే, అక్రమ ఇసుక రవాణాదారులు ఆ కాలువలను పూడ్చివేసి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

**రైతుల డిమాండ్లు:** అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు, మరియు మైనింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యకు పరిష్కారం చూపాలి.ఇది కేవలం ఒక చిన్న ఘటనగా కాకుండా, పేదల ఆశలను నీరుగార్చే చర్యగా పరిగణించాలి. పేదలకు ఉచిత ఇసుక అనే ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరాలంటే అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# సోమశేఖర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి పంచామృతం అభిషేకం



కాణిపాకం, జులై 28 స్వర్ణ సాగరం

కాణిపాకం మోతుకూరి సోమశేఖర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం. కాణిపాకం సోమవారం జై ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మోతుకూరి సోమశేఖర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి పంచామృతం అభిషేకం నిర్వహించడం జరిగింది, అనంతరం వృద్ధులకి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు తెలుగుదేశం పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారి హుండీ ద్వారా 1,81,84,138 ఆదాయం



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో

కాణిపాకం, జులై 28 స్వర్ణ సాగరం

కాణిపాకం స్వామి వారి హుండీ లెక్కింపు.కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 24 రోజులకు రాబడిన ఆదాయం 1,81,84,138 రూపాయలు,బంగారం 40 గ్రాములు,వెండి 790 గ్రాములు,గో సంరక్షణ హుండీ ద్వారా 21,032 రూపాయలు.నిత్య అన్నదానం హుండీ ద్వారా 53,031 రూపాయలు.ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 2488. డాలర్స్. ఇంగ్లాండ్ 5. పౌండ్స్. యూఏఈ 230. ధీరమ్స్.

కెనడా– 55. డాలర్స్. ఈ ఆర్ ఓ 20 .ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు, ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, డి.ఈ.ఓ సాగర్ బాబు, ఏఈఓలు ఎస్వి కృష్ణారెడ్డి,రవీంద్రబాబు,హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ డి పి కార్యక్రమం.. డాక్టర్ రెడ్డప్ప



ఐరాల,జులై 28 స్వర్ణ సాగరం

ఐరాల, ఎఫ్ డి పి కార్యక్రమంలో భాగంగా వేదగిరి వారి పల్లి నందు ఐరాల వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప ఆధ్వర్యంలో షుగరు బిపి థైరాయిడ్ రోగులను పరీక్షించారు, సోమవారం ఇందులో భాగంగా గర్భవతులను పరీక్షించారు వారికి అవసరమైన మందులు సరఫరా చేయడం జరిగింది అవసరం అయిన టెస్ట్స్ , చేసారు ప్రజలకి ఉచిత వైద్య సదుపాయాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో 11 మంది షుగర్ పేషెంట్లు 12 మంది బీపీ పేషెంట్లు గర్భవతులు ఇద్దరూ బాలింత తల్లి ఒకరు థైరాయిడ్ రోగులు ఇద్దరూ చికిత్స పొందారు. జనరల్ పేషెంట్స్ 20 మంది చికిత్స తీసుకున్నారు .ఈ కార్యక్రమంలో ఐరాల వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప , సిహెచ్ఓ ఆదిలక్ష్మి ఎం పి హెచ్ ఎ (ఎం) , మునిరత్నం , ఎం ఎల్ హెచ్ పి నిర్మల, డీఈవో మనోజ్ కుమార్, ఆశ రాజేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

# బంగారుపాళ్యం మండల వైసిపి కార్యవర్గ సభ్యులుగా కె.మొగిలిరెడ్డి

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జూలై 28



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం వైస్సార్సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా గుండ్లకట్టమంచి గ్రామానికి చెందిన కె.మొగిలి రెడ్డి నియమితులైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకముంచి ఈ పదవి రావడానికి కారకులైన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్,లలిత కుమారి,మాజీ జెడ్పి చైర్మన్ ఎంబి కుమార్ రాజా,మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి,శిరీష్ రెడ్డి,పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనిగిరి బస్టాండ్ లో బాలల అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం





కనిగిరి స్వర్ణ సాగరం జూలై 28

బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడడానికి కలిసి పనిచేద్దామని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి బస్టాండ్ లో కనిగిరి డివిజన్ బంగారు బాల్యం కమిటి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, సార్డ్ సంస్థ సహకారంతో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఆధ్వర్యంలో ప్రయాణీకులకు, ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు, ఆర్ టి సి సిబ్బంది కి మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ బాలలు మహిళలు ఎ విధంగా అక్రమ రవాణాకు గురివుతున్నారో,అక్రమ రవాణాకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కలిగించారు.మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా బస్టాండ్ లో అనుమానితులను గమనించిన వెంటనే సహాయం కోసం సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు 1098,100,112, పోలీసులకు లేదా ఇతర సంబంధిత అధికారులకు సమాచారం తెలియజేయాలని వివరించారు.ఈ విధంగా బస్టాండ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా, మానవ అక్రమ రవాణా బారిన పడే వారి సంఖ్యను తగ్గించవచ్చునని డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం అన్నారు. ప్రయాణికుల రక్షణ కొరకు బస్టాండ్ లో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమం లో ఆర్.టి.సి ఎ.ఎస్.ఐ కమాల్ సాహెబ్, ప్రయాణికులు,ఆర్ టి సి ఉద్యోగులు, గుడ్ హెల్ప్ ప్రతినిధులు, సార్డ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఒరవడికి నాంది పలికిన బంగారుపాళ్యం తహసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్





బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జూలై 28

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ లో బంగారుపాళ్యం తహసిల్దార్ కొత్త ఒరవడికి నాంది పలికారు. జిల్లా కలెక్టర్ స్ఫూర్తితో బంగారుపాల్యం తహసిల్దార్ తన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసిల్దార్ తో పాటు మండల సర్వేయర్, విఆర్వోలు ,విలేజ్ సర్వేర్ల ను ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు మండల ప్రజలకు అందుబాటులో ఉంచారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీని అక్కడే ఉన్న సంబంధిత విఆర్ఓ లకు విలేజ్ సర్వేలకు వెంటనే ఇచ్చి రెండు రోజుల్లోపు వాటి సమస్యను పరిష్కరించి నివేదికను కార్యాలయం సమర్పించాలని ఆయన సూచించారు. ఇకపై ప్రతి సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ లో ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. జిల్లా స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ లాగానే రెవెన్యూ శాఖలో మండల స్థాయిలో తాసిల్దార్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. విఆర్వోలు, విలేజ్ సర్వేర్లు అందుబాటులో ఉంటారని ప్రజలకు మీడియా ముఖంగా తెలియజేశారు.

# కోట ఎస్సీ హాస్టల్ బాలిక విద్యార్థిని చిత్రహింసలకు గురి చేసిన పిఈటి పై కఠిన చర్యలు తీసుకోవాలి




## ఎపి ప్రజా సంఘాల అధ్యక్షులు గద్దల మునేయ్య డిమాండ్

స్వర్ణ సాగర్ ప్రతినిధి డక్కిలి

వెంకటగిరి పట్టణంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య విలేఖరి సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా కోట పట్టణంలో బాలిక ఉన్నత పాఠశాలలో చదువుతున్నటువంటి ఎస్సీ హాస్టల్ విద్యార్థుని స్కూల్ యూనిఫామ్ వేసుకొని రాలేదని అక్కడ పనిచేస్తున్నటువంటి పీఈటి మాస్టర్ సుభాను ఎస్సీ హాస్టల్ విద్యార్థులను కులం పేరుతో ప్రస్తావిస్తూ ఒక్కొక్క విద్యార్థిని దగ్గర 100 పైగా గుంజులు తీయించి గుంజులు తీయని వారిని కులం పేరు అడిగి మరీ కొట్టిన సంఘటన సభ్య సమాజంలో చాలా సిగ్గుచేటుగా ఉన్నదని,ఈ సంఘటన ప్రజాసంఘాలు తీవ్రంగా కందిస్తున్నాయి అని,అదేవిధంగా ఇలాంటి సంఘటన మరలా పునరావృతం కాకుండా ఈ సంఘటనకు ప్రధాన బాధ్యుడైన పీఈటి మాస్టర్ సుభాన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మరియు ఎస్పీ, అధికారులను కోరేరు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలియజేసేరు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఇన్చార్జి ఎస్ కే రఫీ. బీఎస్పీ నాయకులు నిజమాల నర్సింహులు,ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరు మూల పాపారావు మాదిగ,పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశాలమేరకు ఇంటిపట్టాలు పంపిణీ







బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జూలై 28

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని తుంబపాల్యం గ్రామంలో భూమిలేని కూలీ జీవనం చేసుకుని నిరుపేదలైన మంజునాథ్,కుప్పమ్మ,హరీష్ ఆచారి, శంషాద్ బీ అనువారు గత 30 సంవత్సరాలు గా తుంబపాలెం కుంట కట్టపైన చిన్న ఇల్లు నిర్మించుకుని కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ నివాసం ఉండేవార సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పై తెలిపినవారు ఎమ్మెల్యే మురళిమోహన్ కు ఇండ్లస్థలాలు కావాలని తుంబపాల్యం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో విన్నవించడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మండల తాసిల్దార్ కు ఫోన్ చేసి వెంటనే ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయాలని ఆదేశాలను జారీ చేయడంతో సోమవారం తాసిల్దార్ బాబూ రాజేంద్ర ప్రసాద్ సర్వేయర్,విఆర్వోలని గ్రామానికి పంపి సమస్యను పరిష్కరించి ప్రభుత్వ భూమిలో వారికి ఇంటి నివాస స్థలాలను లబ్ధిదారులకు చూపించడం జరిగినది.తమకు ఇంటి నివాస స్థలాలు కేటాయించినందుకు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్,బంగారుపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఎన్.పి. ధరణి ప్రసాద్,గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిశీలకులు ఎన్.పి జయప్రకాష్ నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్,గ్రామ సర్పంచ్ ఉషశ్రీ మురళీమోహన్,ఉప సర్పంచ్ చిరంజీవి,బూత్ ఇంచార్జ్ గురుస్వామి యాదవ్,గ్రామ కమిటీ అధ్యక్షుడు అభిరామ్, గ్రామ ప్రధాన కార్యదర్శి గోవిందయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు

# కనిగిరి ప్రాంతాన్ని ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తాం







## ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం జూలై 28

కనిగిరి ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు రామతీర్థం నుండి కనిగిరికి రూ.150 కోట్ల నిధులు కేటాయింపుకు ప్రతిపాదనలు చేయనున్నట్లు శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరి పురపాలకసంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాలు నందు మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులలో మౌళిక వసతులైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజి కాలువలు గుర్తించి నిర్మాణం చేపట్టాలన్నారు. పులి వెంకటరెడ్డి పార్కును శుభ్రం చేయించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని మునిసిపల్ కమీషనర్ ను ఆదేశించారు. కనిగిరి పట్టణం ప్లాస్టిక్ రహిత పట్టణంగా రూపుదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ శాసనసభ్యులు ఉగ్ర సహకారంతో దశల వారీగా పట్టణ అభివృద్ధి చేస్తామన్నారు. బాల్య వివాహాల రహిత, ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటిగా తీర్చిదిద్దేందుకు కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది సహకరించాలని కోరారు. సమావేశంలో 75 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత రూ. 7 లక్షలతో పునరుద్ధరించిన కౌన్సిల్ సమావేశ హాలును ఎం.ఎల్.ఎ, చైర్మన్ లు ప్రారంభిచారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, ఎఈ మాధవరావు, టిపిఎస్ సువర్ణకుమార్, మునిసిపల్ సిబ్బంది ప్రదీప్, చెన్న కేశవ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ను ఘనంగా సన్మానించిన స్టేట్ టిజేఏ కమిటీ







## టీజేఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి హాజరైన సూర్యాపేట జిల్లా కమిటీ

## సూర్యాపేట జిల్లాలో టీజేఏను మండలాల వారీగా విస్తరించాలి

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా జూలై / 28

తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించిన టీజేఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్ర సమావేశానికి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో టి జే ఏ సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం పాల్గొనడం జరిగింది.టీజేఏ యూనియన్ సూర్యాపేట జిల్లాలో బలంగా పనిచేస్తుందని హుజూర్ నగర్, కోదాడ,సూర్యాపేట,తుంగతుర్తి,నియోజకవర్గాలలో కమిటీలను వేయాలని టీజేఏ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు ఆదేశించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లా నూతన కమిటీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు వాసుదేవ రావు,సూర్యపేట జిల్లా తరపున కొత్తపల్లిమధు,కొల్లోజు నాగేంద్ర చారి, భీమపంగు వెంకటేశ్వర్లు,గోరంట్ల శ్రీనివాస్, కొమ్ము మహేష్, పెందుర్తి సతీష్,బయ్యారపు రవీంద్ర, షేక్ నాగుల్ మీరా,మక్బూల్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) పునః ప్రారంభం







స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి,28– జూలై 2025 – స్థానిక ప్రజల విద్యాభివృద్ధి లక్ష్యంతో స్కిట్ కళాశాల పునః ప్రారంభం పొందే దిశగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టబడ్డాయి. ఎంఎల్ఏ బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల హామీని నెరవేర్చుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో స్కిట్ కళాశాల మళ్ళీ పునః ప్రారంభించబడింది. ఫలితంగా, జాయింట్ అనంతపురలో స్కిట్ విలీనం కోసం అధికారిక ఉత్తర్వులు వెలుపడ్డాయి. రెండవ విడత ఎంసెట్ కౌన్సిలింగ్ లో స్కిట్ కళాశాల లిస్ట్ అయింది.స్కిట్ 1997లో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మానసపుత్రికగా స్థాపించబడింది. అది పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించడంలో కీలక పాత్ర వహించింది. అయితే, 2020–21 విద్యాసంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నూతన ప్రవేశాలు నిలిపివేయబడ్డాయి. నేడు కూటమి ప్రభుత్వ సహకారం, మంత్రి నారా లోకేష్ నిబద్ధత, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పట్టుదలతో తిరిగి ప్రారంభించేందుకు అనుకున్న ప్రకారం, సి ఎస్ ఈ, ఈ సి ఈ, ఈఈఈ, సివిల్ % మెకానికల్ ఇంజనీరింగ్ జూనియర్ ఇంజనీరింగ్ కోర్సులు ఈ సంవత్సరం ప్రారంభించబడనున్నాయి.

స్వర్ణసాగరం



# మోతుకూరి సోమశేఖర్ నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన అభిమానులు









ఐరాల,జులై 28 స్వర్ణ సాగరం

మోతుకూరి సోమశేఖర్ నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన అభిమానులు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, యువ కిషోర్, జై ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మోతుకూరి సోమశేఖర్ నాయుడు జన్మదిన వేడుకలను మండలంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి, కూటమి పార్టీ అభిమానులు భారీ ఎత్తున జన్మదిన వేడుకలను నిర్వహించారు. వాడ వాడలా అభిమానులు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా మోతుకూరి సోమశేఖర్ నాయుడు పాల్గొని అభిమానుల కోరిక మేరకు కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని వారిని సంతోషపరిచారు. పూతలపట్టు నియోజకవర్గం లోని అభిమానులే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని సోమశేఖర్ నాయుడు మిత్రులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ మీరు నా మీద చూపిన ప్రేమ అభిమానాలను ఎన్నటికీ మరువలేనని ఎప్పటికీ మీకు రుణపడి ఉంటానని తెలియజేస్తూ ధన్యవాదాలు తెలిపారు

# అక్రమ క్వారిని నిలుపుదల చేయాలి

స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి జూలై 28:-





చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గడ్డురు వద్ద నిర్వహిస్తున్న ప్రజావ్యతిరేక అక్రమ క్వారీని వెంటనే నిలుపుదల చేయాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం మానవ హక్కుల బృందం పలమనేర్ డివిజన్ కార్యదర్శి మణి ఆధ్వర్యంలో తీర్థం గడ్డూరు వద్ద నిర్వహిస్తున్న అక్రమ క్వారీనీ చుట్టుపక్కల పంట పొలాలను ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని హంద్రీనీవా కాలువకు జరిగే ప్రమాదాన్ని స్వయాన పరిశీలించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్వారికి సంబంధించిన అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తప్పుడు రిపోర్టుల ద్వారా అనుమతి ఇచ్చినందుకు ఆ ప్రాంతంలో ఆస్తి, ప్రాణ, జంతువులు నష్టపడే ప్రమాదం ఉందని గుర్తించామన్నారు. క్వారీ బ్లాస్టింగ్ కోసం పంచాయితీ ద్వారా నీటి పైప్ లైన్ వేస్తామని తప్పుడు సంతకాలతో రిజల్వేషన్ తీసుకున్నారని ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రజలు కట్టుకున్న ఇండ్లు పగుళ్లు రావడం స్వయాన మానవ హక్కుల బృందం పరిశీలించడం జరిగిందన్నారు. సుమారు 20 సంవత్సరాలు నుండి సదరు బండపై వడ్డే సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాలు అక్కడ జల్లి, రాతి కూసాలు, తదితర రకాలైన బండలు తయారుచేసి జూనోపాదులు చేసుకునే వారిని అలాంటి వారి జీవనోపాదుల పైన దెబ్బ కొట్టి బయట తరిమి ప్రస్తుతం వారు కూలి పనులు చేసుకోవడానికి కూడా చేతగాని వారిగా మిగిలిపోయారనే విషయం పరిశీలనలో తేలిందన్నారు. ప్రజల సౌకర్యం కోసం గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన హంద్రీనీవా కాలువ సైతం 75 అడుగుల దూరంలోనే ఉండడం గుర్తించామన్నారు. ప్రాంతములో ప్రజలకు ప్రమాదకరమైన జెలిటన్ స్టిక్స్ విచ్చలవిడిగా పడేయడం వలన ఏ సమయానికి ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. అదేవిధంగా పూర్వీకుల నుండి చుట్టుపక్కల గ్రామస్తులు పండించే ఫలసాయాన్ని సదరు బండపై వేసు కుని ఎండకు ఆరబె ట్టుకునే వారని అలా ంటి సౌకర్యం ప్రజలు కోల్పోయారని గుర్తు చేశారు. అదేవిధంగా సంవత్సరానికి మూడు నుండి నాలుగు పంటలు పండించే రైతులు బండ బ్లాస్టింగ్ చేయడం వలన వ్యవసాయ బోర్లు లో షీల్ట్ వచ్చి మూసు కుపోవడం వలన వ్యవసాయం చేయలేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే దుస్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో జరుగుతున్న అన్ని రకాల నష్టాలను పరిశీలించిన పిమ్మట రైతులకు న్యాయం చేయాలని కోరుతూ డిమాండ్లతో కూడిన మెమొరండాన్ని బైరెడ్డిపల్లి తహసిల్దార్ ప్రసన్న కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల బృందముతో పాటు 200 మంది చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

# పానకాలు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా జూలై / 28



హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయిని గూడెంకు చెందిన గ్రామ సీనియర్ నాయకులు మేకల పానకాలు అకాల మరణం చెందడం వలన వారి కుటుంబాన్ని హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు తదనంతరం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేరేడుచెర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన గ్రామ సీనియర్ నాయకులు మంత్రి సైదులు,మల్గిరెడ్డి నారాయణ రెడ్డి లను పరామర్శించడం జరిగినది.నేరేడుచెర్ల పట్టణంలో బీజేపీ మండల నాయకులు హిందూజా యొక్క నూతనంగా ఏర్పాటు చేసిన పశువుల దాణా షాప్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమాలలో బీజేపీ జిల్లా నాయకులు చింతకుంట్ల సోమిరెడ్డి, ఆకులజగతయ్య మండల,పట్టణ అధ్యక్షులు నాగిరెడ్డి,వెంకటశివ,రాజేష్, నాగయ్య ,నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీగోదాదేవి అమ్మవారి పుట్టినరోజు సంబరాలు






స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా జూలై / 28

శ్రీ ఆదివారహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీగోదాదేవి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా సోమవారం సుప్రభాత సేవ 9 గంటలకు అమ్మవారికి నవ కలశ అభిషేకము,తులసిపూజ, పుష్పాలంకరణ తదుపరి కుంకుమార్చన,ఆరగింపు, మంగళాశాసనము,పల్లకి సేవ తదుపరి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమములు నిర్వహించడం జరిగినవి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య. ధర్మకర్తలు తిపిరిశెట్టి హరీష్ కుమార్,కోల కృష్ణ ప్రసాద్,గంధం అంజయ్య,వేముల నరసింహారావు,పెనూబేల్లి హనుమంతరావు,మేరిగా కవిత,ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు,ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారాచార్యులు,పి శ్రీనివాసచార్యులు.కుమ్మరి కుంట్ల వెంకటనారాయణ. కొత్త ప్రవీణ్ కుమార్ గుప్తా,యరగాని గోపాలం,యరగాని గురవయ్య,దొంగరి సత్యనారాయణ.మాడుగుల లింగయ్య,గోవింద్' వెంకటేశ్వరరావు,శ్రవణ్ కుమార్,అచ్చాలు,బ్రహ్మం, అనసూర్యమ్మ,ఉషారాణి,ప్రవళిక,ప్రియాంక, విజయలక్ష్మి, నాగలక్ష్మి, అరుణమ్మ, సావిత్రమ్మ,మరియు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పంచాలి నగర్‌లో ఓపెన్ బూజింగ్ స్థల శుభ్రపరిచిన పట్టణ పోలీస్

రేణిగుంట స్వర్ణ సాగరం జూలై 28





రేణిగుంట పట్టణ పోలీస్ పట్టణ ప్రజల ఆరోగ్యం పై శ్రద్ధ చూపిస్తూ వినూత్నంగా కదం తొక్కారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ జయచంద్ర, ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పంచాలి నగర్ ప్రాంతంలో ఓపెన్ బూజింగ్ స్థలాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు చైతన్యం కలిగించే ఉద్దేశంతో పాల్గొన్నారు. మలిన ప్రాంతాలు ప్రజారోగ్యానికి హానికరం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను కలిగించింది. రేణిగుంట పోలీసుల ఈ ప్రయత్నాన్ని స్థానికులు అభినందించారు.

# ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన బొజ్జల బృందమ్మ,





స్వర్ణ సాగరం -తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం లోని చియ్యవరం గ్రామం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా, చియ్యవరం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన బొజ్జల బృందమ్మ , ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు, అవసరాలు విని వెంటనే స్పందించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన నీరు లభించనుంది.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రయత్నాన్ని బొజ్జల బృందమ్మ అభినందించారు. గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరపాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపు




**పోలవరం స్వర్ణ సాగరం**

ఆగస్ 9 న ఐటీడీఏ కార్యాలయంలో జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు కె.ఆర్.పురం ఐటీడీఏలో ప్రాజెక్ట్ ఆఫీసర్ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాలతో సమీక్ష సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు , ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బాలరాజు , "ఆదివాసీల హక్కులు, సంస్కృతి, జీవన విధానాలపై సమాజంలో విస్తృత అవగాహన అవసరం అన్నారు ఆదివాసీ దినోత్సవాన్ని సందేశాత్మకంగా, ఆకర్షణీయంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, ఆదివాసీ సంఘాలు సమష్టిగా పనిచేయాలి అని పేర్కొన్నారు సమావేశంలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## దేశంలో క్రిప్టోకరెన్సీ వాడకం, నియంత్రణపై కేంద్రం చర్యలు.



**ఏలూరు, స్వర్ణ సాగరం**

దేశంలో క్రిప్టోకరెన్సీ వాడకం, నియంత్రణపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. గత ఐదేళ్లలో దేశంలో క్రిప్టోకరెన్సీ వాడకం, నియంత్రణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.భారత ప్రభుత్వం ఇప్పటి వరకు క్రిప్టోకరెన్సీ వాడకం గురించి ప్రత్యేకంగా ఎలాంటి అధ్యయనం నిర్వహించలేదని, క్రిప్టోకరెన్సీ లేదా వర్చువల్ డిజిటల్ ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం– 2002 పరిధిలోకి 2023న మార్చి 7న కేంద్రం తీసుకువచ్చిందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. వీటితో కూడిన లావాదేవీలకు ఆదాయపు పన్ను చట్టం, 1961 కింద పన్నులు విధించబడుతున్నాయని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం– 2000 కూడా కొన్ని సందర్భాల్లో వర్తిస్తుందని, కంపెనీలు వాటి ఆర్థిక నివేదికల్లో క్రిప్టో ఆస్తుల వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని కంపెనీ చట్టం– 2021లో 2013 మార్చి 24 జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా మార్పులు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రిప్టో ఆస్తులను పరోక్షంగా పన్నుల విధానం, మనీలాండరింగ్ చట్టం, కంపెనీల వివరాల ప్రకటనల ద్వారా పర్యవేక్షిస్తోందని, నేరుగా నియంత్రణ కోసం అంతర్జాతీయ సహకారం అవసరం ఉందని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలోనే ఖాతాదారులను హెచ్చరిస్తూ సలహాలు జారీ చేసిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## మాయమాటలతో మోసం -ఇద్దరు మహిళల బంగారం గల్లంతు

**స్వర్ణ సాగరం- తొట్టంబేడు,**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం మాయమాటలతో మహిళలను మోసం చేసిన సంఘటన కలకలం రేపింది.ఉదయం 8:30 గంటల ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి ద్విచక్ర వాహనంపై గ్రామంలోకి వచ్చాడు. వాయువులకు, బేదులకు మందులు వేస్తున్నానని, పూజల పేరుతో మంచి జరగాలంటే కొన్ని వస్తువులు కావాలని చెబుతూ వీధివీధి తిరిగాడు.ఒక మహిళ ఇంటికి వెళ్లిన మోసగాడు, "మీ ఇంట్లో మంచి జరగాలంటే పసుపు, కుంకుమ, ఉప్పు, మిరపకాయలు తీసుకురండి" అని చెప్పాడు. ఆమె తీసుకొచ్చిన తర్వాత, "మీ ఇంట్లో ఉన్న బంగారం అమ్మవారి మెడలో వేసి, గంటలో తిరిగి తీసుకువస్తాను" అంటూ ఆమె చెవిలో ఉన్న రెండున్నర గ్రాముల బంగారు కుంకుమబొట్టు తీసుకున్నాడు. అనంతరం ఆమె ముఖానికి నీళ్లు చల్లి తను తప్పించుకున్నాడు.ఇలాంటి అదే మాయమాటలు చెప్పి చిన్న సింగమాల గ్రామంలో మరో మహిళ దగ్గర 10 గంటల సమయంలో నాలుగు గ్రాముల బంగారాన్ని మోసగాడు తీసుకెళ్లాడు.ఈ ఘటనలతో బాధిత మహిళలు బోరున విలపించారు. "మమ్మల్ని మోసం చేసిన మాయగాళ్లను పట్టుకొని, మా బంగారం తిరిగి ఇప్పించాలని కోరుతున్నాం" అని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.గ్రామస్థులు అధికారులను గట్టిగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో అలాంటి మోసగాళ్ల సంచారం నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం చెంబెడు చెరువు రిజర్వాయర్ గా అభివృద్ధి






**సూళ్ళూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**

**పెళ్లకూరు స్వర్ణ సాగరం జూలై 29.**

కూటమి ప్రభుత్వంలో రైతుల శ్రేయసే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సుపరిపాలనలో భాగంగా చెంబెడు చెరువును మినీ రిజర్వాయర్ గా అభివృద్ధి చేసి రైతుల శ్రేయస్సు కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చెన్నప్ప నాయుడుపేట, చెంబెడు, ఆర్లపాడు, పునబాక తూర్పు కండ్రిగ, పునబాక గ్రామాలలో నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి బాణాసంచా కాల్చుతో మంగళహారతులతో ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. గజమాలలో, శాలువాలతో ఎమ్మెల్యేని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు నేరుగా చేరుతున్నాయో లేదో తెలుసుకునేందుకు తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు తమను పంపినట్లు వివరించారు. ప్రతి నెల ఒకటో తేదీ క్రమం తప్పకుండా పింఛన్ నగదు పంపిణీ చేయడం, ఏడాదికి మూడు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం, ఆగస్టు 15 నుండి మహిళలంతా అంతర్ జిల్లాలలో తిరిగే బస్సు సౌకర్యం కల్పించడం కూటమిపాలన ప్రతిష్టకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, భాను, మల్లీ రెడ్డి, మునివర్ధన్ రెడ్డి, సుబ్బరామయ్య, నాగేంద్ర, బెన్నీ, పోలయ్య, హరి నాయుడు, యుగంధర్, కుమార్, రమేష్ నాయుడు, శివకుమార్, ప్రసాద్ నాయుడు, పరుశురాం, రవి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్వారీ యజమాని నిర్వాకం.. ఆపై రూ: 3 కోట్ల పన్నులు ఎగవేత..?

### మైన్స్ నిబంధనలా... అది మాకు వంట పట్టదు..

### -విచారణకు సహకరించక పోయినా...

### ఆపై బెదిరింపులు

**కార్వేటి నగరం: (శ్రీరంగారాజపురం) స్వర్ణ సాగరం: (జూలై 28)**



అక్రమ క్వారీ యజమాని నిర్వాకంతో.. ప్రభుత్వానికి రావలసిన దాదాపు రూ: 3 కోట్ల పన్నులను ఎగవేత వేయడమే కాకుండా, క్వారీకి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులకు చూపక పోవడమే కాకుండా, ఆపై మైన్స్ నిబంధనలా ..అది మాకు వంట పట్టదు.. అంటూ ..... అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు విచారణకు చేస్తామని వస్తే, సహకరించక పోవడమే కాకుండా... ఆపై బెదిరింపులకు దిగిన ఘటన చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గం, కార్వేటి నగరం మండలం సురేంద్ర నగరంలో అటవీ సమీపంలో నడుపుతున్న ఓ క్వారీ యజమాని తీరు... జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.

**గత ప్రభుత్వంలో చట్ట విరుద్ధంగా లీజు మంజూరు..?**

ప్రకాశం జిల్లా, ఒంగోలు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి, తన రాజకీయ పరిచయాలతో క్వారీ లీజు దక్కించుకున్నాడు. దక్కించుకున్న లీజు.. చట్ట విరుద్ధంగా ఉంది. ఆపై గత ప్రభుత్వంలో మైన్స్ సంబంధిత అధికారులు, అతనికి చేదోడు వాదోడుగా ఉంటూ క్వారీ నిర్వహణకు దాసోహమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో క్వారీ యజమాని గత ప్రభుత్వ హయాంలో రాజకీయంగా, వివిధ శాఖల అధికారులతో కుమ్ముకై అవినీతి సొమ్మును పోగు చేసుకున్నట్లు ప్రస్ఫుటంగా తెలుస్తోంది. ఇదంతా చట్ట విరుద్ధంగా చేసినవే అని... ఆ క్వారీ యజమాని దగ్గర ఉన్న నిబంధనల కాగితాలే సాక్ష్యం. ప్రస్తుతం అతని దగ్గర ఉన్న.. హక్కు పత్రాలు అన్ని... నిజ నిర్ధారణ లో ఉత్తిత్తివి అనే తేలిపోయింది. వాస్తవానికి ఆ క్వారీ నిబంధనలు పాటించక పోవడంతో మైన్స్ అధికారులు క్వారీని పరిశీలించి దాదాపు రూ:3 కోట్ల పన్నులు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇంత జరిగిన అతను మాత్రం... యధా రాజా.... తథా ప్రజా అంటూ తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. ప్రస్తుతం ఈ క్వారీ నిర్వహణ స్థానిక ప్రజలకు ఇష్టం లేదు. ఈ క్వారీ నిర్వహిస్తే పర్యావరణతో పాటు... రైతులు, స్థానిక ప్రజలకు నష్టం చేకూరుతుందని విచారం స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు .

**మైన్స్ నిబంధనలా... అది మాకు వంట పట్టదు**

ఈ క్వారీ నిర్వహణ పై స్థానిక అధికారులు రంగ ప్రవేశం చేసి, సర్వే చేయుటకు సిద్ధపడారు. దీంతో క్వారీ యజమాని నుంచి బెదిరింపులు వస్తున్నాయని, స్థానిక అధికారులు వాపోతున్నట్లు స్థానిక ప్రజల ద్వారా తెలిసింది. క్వారీ లీజుకు సంబంధించిన విషయాలను స్థానిక అధికారి, కొన్ని పత్రికల్లో తప్పుడు వార్తను ప్రచురించినట్లు తెలుస్తోంది. అక్రమ కోరి లీజుకు సంబంధించిన వ్యవహారంలో స్థాని క అధికారి ఇలా చేయడంతో... నేతలు, స్థానిక ప్రజలు విస్తు పోతున్నారు. అక్రమంగా క్వారీ నిర్వహనే కాకుండా, ఆపై లీజ్ మంజూరు విష యంలో అధికారి పాత్ర స్పష్టంగా ఉన్నట్లు తెలు స్తోంది. ఇలా అధికారి దగ్గరుండి అన్ని చెక్క దిద్దడంతో ... చట్టానికి, ప్రభుత్వానికి తూట్లు పొడిచారని నేతలు, సమీప గ్రామ ప్రజలు వాపోతున్నారు. లీజు దారుడు ప్రస్తుతం స్థానిక రెవెన్యూ కార్యాలయం తో పాటు, పోలీసు శాఖ, మైన్స్ శాఖతో ఉన్న సిబ్బందితో పలు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్వారీ పనులను నిలుపుదల చేయాలని స్థానిక ప్రజలు అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. స్థానిక ప్రజల సూచనతో అన్ని శాఖల అ ధికారులు, క్వారీ నిర్వహణపై దండయాత్ర చేసి, క్వారీ నిబంధనలను పరిశీలించి, క్వారీ లీజును రద్దు చేస్తే పర్యావరణంతో పాటు, స్థానిక నివాసిత ప్రాంతాలు ఆరోగ్య ంగా ఉండడానికి అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ.. అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు.

**ఈ క్వారీ లీజు విషయంలో.. ఇప్పటికే ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు..?**

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఈ క్వారీకి సంబంధించి గతంలో క్వారీ యజమాని.. కొన్ని అసత్య ఆరోపణలు చేశారు. కానీ ఆ విషయంలో రాజకీయంగా కొందరు స్వార్థపరులు ఎమ్మెల్యేకు చెడు చేయాలనుకోవడం కుట్రలో భాగమేనని పలువురు నేతలు, స్థానిక ప్రజలు అభిప్రాయం తెలుపుతున్నారు.

## గుర్తు తెలియని శవం

**నాగలాపురం -స్వర్ణ సాగరం జూలై 28:**



నాగలాపురం మండలం,కృష్ణాపురం గ్రామంలో హరిజనవాడ పరిధిలోని సర్వే నెం.99 లో ఉన్న తిప్పారెడ్డి, వెంకటేశ్వరరావు పొలంలో ఉన్న బావిలో గుర్తుతెలియని శవం కనిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే సబ్ ఇన్స్పెక్టర్ సునీల్,నాగలాపురం మండల రెవెన్యూ అధికారి సహకారంతో గ్రామ రెవెన్యూ అధికారి మహేష్ స్థానికులను విచారించినా ఫిర్యాదు ఆధారంగా నాగలాపురం పోలీస్ స్టేషనులో సబ్ ఇన్స్పెక్టర్ సునీల్,ప్రొఫెషనరీ సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్,యథావిధిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించగ ఈ క్రమంలో నాగలాపురం పట్టణంలోని పొట్టి నాయుడు వీధికి చెందిన గజేంద్ర వయసు 60 సంవత్సరాలు అతనుగా గుర్తించారు.



## ప్రసాద్ ఎస్ఐకి పోలీసులతో పరిచయం సమావేశం

**నాగలాపురం -స్వర్ణ సాగరం జూలై 28:**



నాగలాపురం మండలానికి నూతన ప్రొఫెషనరీ సబ్ ఇన్స్పెక్టర్గా జి.ప్రసాద్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నాగలాపురం మండలం సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ పోలీస్ స్టేషన్ లోని కానిస్టేబుల్ తో పరిచయ సమావేశం ఏర్పాటు చేశారు.